




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 308 సోమవారం 4-11-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


# బీసీ కులగణనకు డెడికేటెడ్ కమిషన్

**నేడే ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం**

**హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ**

**కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం.. చైర్మన్, ముగ్గురు సభ్యులు!**

**చిత్తశుద్ధితో ఉన్నామన్న రేవంత్.. 6 నుంచి రాష్ట్రంలో కులగణన**

**హైదరాబాద్, నవంబరు 3 :** రాష్ట్రంలో బీసీ జనాభా గణనకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీల లెక్కలు తీసేందుకు బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సోమవారంలోగా కమిషన్‌ను ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన జీవో జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలను శాస్త్రీయమైన పద్ధతిలో తేల్చేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను రెండు వారాల్లో నియమించాలంటూ హైకోర్టు అక్టోబరు 30న ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. బీసీల జనాభాను లెక్కించే పనిని బీసీ కమిషన్‌కు అప్పగించడం చెల్లదని, ఇందుకు రాజ్యాంగంలోని నిబంధనలు అంగీకరించవని పేర్కొంటూ మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా లెక్కలు తేల్చేందుకు ప్రత్యేక కమిషన్ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అందుబాటులో ఉన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటుఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కుల గణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు లేవనెత్తిన అంశాలపై సమీక్షించారు. అందరి ఏకాభిప్రాయం మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**బీసీ కులగణనపై చిత్తశుద్ధితో ఉన్నాం..**

బీసీ కులగణనపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి కులగణన ప్రారంభించనున్న నేపథ్యంలో.. బీసీ రిజర్వేషన్లపై భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా కోర్టు తీర్పులకు అనుగుణంగా నడచుకోవాలని అన్నారు. కాగా, బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్వాగతించారు. రాష్ట్రంలోని బీసీ సమాజం తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందని, బీసీలపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని అన్నారు.

**కమిషన్‌కు చైర్మన్, ముగ్గురు సభ్యులు..**

బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను చైర్మన్, ముగ్గురు సభ్యులు, ఒక మెంబర్ సెక్రటరీతో ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.




# ఝార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి!

**గిరిజనులకు మినహాయింపు: అమిత్ షా**

**5 లక్షల ఉద్యోగాలు.. 500కే సిలిండర్**

**మహిళలకు ప్రతినెలా రూ.2,100**

**బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల**



**న్యూఢిల్లీ, నవంబరు 3:** ఝార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఈనెలలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న ఝార?ండ్‌లో 'సంకల్ప పత్ర' పేరిట బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం ఆయన విడుదల చేశారు. కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, సంజయ్ సేథ్, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ ఝార?ండ్ భవిష్యత్తుకు ఈ ఎన్నికలే కీలకమన్నారు. పూర్తి అవినీతి ప్రభుత్వం కావాలో లేక, మోదీ నాయకత్వంలో అభివృద్ధి మార్గంలో పయనించే బీజేపీ ప్రభుత్వం కావాలో ఝార?ండ్ ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. ఝార?ండ్‌కు గుర్తింపు, చొరబాటుదారుల నుంచి భూమి, మహిళల రక్షణ బీజేపీ లక్ష్యమని చెప్పారు. ఝార?ండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామని, అయితే, దాని నుంచి గిరిజనులకు మినహాయింపు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. 2.87 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు సహా మొత్తం 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామని, దీపావళి, రాఖీ పండుగలకు పూర్తి ఉచితంగా 2 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని పేర్కొన్నారు. గోగో దీదీ స్కీం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తామని తెలిపారు. పరిశ్రమలు, మైనింగ్ వల్ల నిర్వాసితులైనవారి పునరావాసానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.


**చొరబాటుదారుల్ని తలకిందులుగా వేలాడదీస్తాం**

మహిళలను వేధిస్తున్న చొరబాటుదారులను తలకిందులుగా వేలాడదీస్తామని అమిత్‌షా హెచ్చరించారు. ఝార?ండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం ద్వారా గిరిజనుల భద్రతపై రాజీ పడిందని విమర్శించారు.

మిగతా 2లో...

# ట్రంపా.. కమలా?

**- అమెరికా ఎన్నికల్లో గట్టి పోటీ - ఇద్దరూ మ్యాజిక్ ఫిగర్‌కు దగ్గర్లో!**



**న్యూయార్క్, నవంబరు 3:** అగ్రరాజ్యం అమెరికా ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. సోమవారం వరకే గడువు ఉండడంతో.. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్ స్వింగ్ రాష్ట్రాలు విస్కాన్సిన్, నార్త్ కరోలినా, మిషిగాన్, జార్జియా, పెన్సిల్వేనియాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. షెడ్యూళ్ల వారీగా సోమవారం వరకు ఆయా రాష్ట్రాలను చుట్టేసి.. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజానాడిని పట్టుకుంటూ అమెరికా ఎన్నికలను అంచనా వేస్తున్న 272టువిన్ డాట్ కామ్, రియల్‌క్లియర్‌పాలిటిక్స్ డాట్ కామ్ వంటి సంస్థలు ట్రెండ్స్ క్షణక్షణం మారుతున్నాయని పేర్కొంటున్నాయి. 272 మ్యాజిక్ ఫిగర్‌కు ఇరువురు అభ్యర్థులు 50లోపు స్థానాల దూరంలో ఉన్నట్లు చెబుతున్నాయి. కమల 226, ట్రంప్ 219 స్థానాల్లో ముందంజలో ఉండగా.. మ్యాజిక్ ఫిగర్‌కు కమల 44, ట్రంప్ 51 సీట్ల దూరంలో ఉన్నట్లు చెబుతున్నాయి. దీంతో కీలకమైన స్వింగ్ రాష్ట్రాలపై ఇరువురు అభ్యర్థులు దృష్టి సారించారు. మరోవైపు 'ఎర్లీ పోలింగ్' సదుపాయాన్ని 6.8 కోట్ల మంది అమెరికన్లు వినియోగించుకున్నారు. ఎన్నికల రోజు ప్రతికూల వాతావరణం, క్యూలైన్ల సమస్యను పరిష్కరించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, ముందెన్నడూ లేని విధంగా.. అమెరికా ఎన్నికలు అంతర్జాతీయంగా ఉత్కంఠ రేపుతున్నాయి. 1945 తర్వాత యావత్ ప్రపంచం ఎన్నడూ అమెరికా ఎన్నికలను ఇంత ఆసక్తిగా పట్టించుకోలేదు. అందుక్కారణం.. ట్రంప్, కమలల్లో ఎవరు గెలిస్తే.. ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంచనాలే..! ట్రంప్ తాను విజయం సాధిస్తే.. అంతర్జాతీయంగా అమెరికా పాత్రను పూర్తిగా మార్చేస్తానని ప్రకటించారు. కమలా హ్యారిస్ అంతర్జాతీయ అజెండాను మరింతగా పెంచుతానని పేర్కొన్నారు. నాటో విషయంలోనూ వీరి అజెండా చెరోదారిగా ఉంది. కమల గెలిస్తే.. నాటోలో అమెరికా పెద్దన్న పాత్ర కొనసాగనుండగా.. ట్రంప్ సభ్యదేశాలపై భారాన్ని పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు. నాటోలోని ఇతర 31 సభ్యదేశాల మిలిటరీ బడ్జెట్ మొత్తంలో 2/3 వంతును అమెరికా తమ దేశ రక్షణ రంగంపై వెచ్చిస్తోంది. ట్రంప్ గెలిస్తే సభ్య దేశాలు తమ జీడీపీలో 2% నిధులను

మిగతా 2లో...

# నీటి పారుదల శాఖ.. సీఈ, ఈఎన్‌సీపై చర్యలు

**రాహుల్‌బొజ్జాను ఆదేశించిన మంత్రి ఉత్తమ్**

**'సీతారామ' ప్రాజెక్టుపై సమీక్షలో.. మంత్రుల ముందే.. సీఈ వర్సెస్ ఈఎన్‌సీ**

**నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు**

**అధికారులకు మంత్రి ఉత్తమ్ వార్నింగ్**



**హైదరాబాద్, నవంబరు 3:** నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్(సీఈ) ఎం.శ్రీనివాసరెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ-జనరల్) జి.అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టులో అనుమతుల్లేకుండా డిస్ట్రిబ్యూటరీ నిర్మాణం, అనుబంధ పనుల టెండర్ల నిర్వహణలో జరిగిన తప్పిదాలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అనుమతుల్లేకుండా పనులు చేపట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్ష సందర్భంగా.. డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు పరిపాలనపర అనుమతుల కోసం ప్రతిపాదనలను సమర్పించినా, ఈఎన్‌సీ(జనరల్) సహకరించడం లేదని సీఈ ఆరోపణలు చేశారు. దీనికి ఈఎన్‌సీ స్పందిస్తూ.. తమకు సవివర అంచనాలు(డిటైల్డ్ ఎస్టిమేట్స్) అందలేదని బదులిచ్చినట్లు తెలిసింది. ఈ వివరాలు లేకుండా అనుమతులు ఇస్తే.. అంచనాలు భారీగా పెరిగే ప్రమాదముందని వివరించారు. దాంతో సీఈ పెద్దగా అరుస్తూ.. ప్రభుత్వ ఆదేశాలతోనే టెండర్లను ఆహ్వానించినట్లు బదులిచ్చారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రుల ముందే ఒకరినొకరు ఏకవచనంతో పిలుచుకోవడంతో.. ఉత్తమ్ సీరియస్ అయినట్లు సమాచారం. దాంతో.. సీఈ, ఈఎన్‌సీని పిలిపించుకుని, తగిన చర్యలు తీసుకోవాలంటూ నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జాను మంత్రి ఆదేశించారు. కాగా.. సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.7,926.14 కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 18న పరిపాలనపర అనుమతులివ్వగా, 2018 ఆగస్టులో రూ.13,057 కోట్లకు పెంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిని తప్పుబటుతూ రాష్ట్ర మంత్రులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని గుర్తు చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆదివారం సామాజిక మాధ్యమం వేదికగా కేటీఆర్ ఆరోపణలు చేశారు.

**గత నెలలోనే ప్రతిపాదనలు**

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం సీఈ గత నెలలో నీటిపారుదల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. డిటైల్డ్ ఎస్టిమేట్స్, డిజైన్లు, డ్రాయింగ్స్ లేకపోవడంతో వాటిని సమర్పించాలని కోరుతూ ఈఎన్‌సీ(జనరల్) ఆ ప్రతిపాదనలను వెనక్కి పంపారు. గత నెలలో నిర్వహించిన ఓ సమీక్షలో మంత్రులు ఆదేశించడంతో ప్రాజెక్టు అధికారులు తొందరపడి టెండర్లను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. పరిపాలనాపరమైన అనుమతులే

మిగతా 2లో...

## వాయుసేన- ఉబెర్ ఒప్పందంపై నిపుణుల అభ్యంతరాలు

**న్యూఢిల్లీ, నవంబరు 3 :** భారత వాయుసేన, అమెరికాకు చెందిన రైడ్ షేరింగ్ యాప్ 'ఉబెర్' మధ్య ఇటీవల జరిగిన అవగాహన ఒప్పందంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవు తున్నాయి. ఈ ఒప్పందంతో వాయుసేన సమాచార గోప్యతకు, వాయుసేన సిబ్బంది రక్షణకు ముప్పు పొంచి ఉందని వాయు సేన మాజీ ఉద్యోగులు, భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఒప్పందం ప్రకారం వాయుసేన ప్రస్తుత, మాజీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల రవాణా అవసరాలకు అనుగుణంగా ఉబెర్ ఓ ప్రత్యేక అప్లికేషన్‌ను వాయుసేనకు ఇవ్వనుందని సమాచారం. ఉబెర్ సేవలు వినియోగించుకోవడం వల్ల వాయుసేనకు సంబంధించిన కీలక సమాచారం, లొకేషన్లు, ఉద్యోగుల వివరాలు బయటి వ్యక్తులకు బహిర్గతం అవుతాయని వాయుసేన మాజీ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.




## జమిలి ఎన్నికలు వద్దు.. టీవీకే తీర్మానం



**చెన్నై, నవంబరు 3:** జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా తమిళ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగం (టీవీకే) కార్యనిర్వాహక మండలి సమావేశంలో తీర్మానం చేశారు. పాలకపక్షం డీఎంకే ఏళ్ల తరబడి చేస్తున్న నీట్ వ్యతిరేక ప్రతిపాదనను కూడా ఈ సమావేశంలో ఓ తీర్మానంగా చేసి ఆమోదించారు. సామాజిక న్యాయంకోసం రాష్ట్రంలో కులాలవారీ జనగణన జరపాల్సిన అవసరం ఉందని మరొక తీర్మానం చేశారు.

# మెడికల్ సీటు సాధించిన అరెపెల్లి అక్షయను సన్మానించిన నాయకులు







**తొలి సమయం ఎల్కతుర్తి నవంబర్ 03**

ఆదివారం రోజునా భవన నిర్మాణ కూలీల సంఘము అధ్యక్షులు రేణుకుంట్ల సాంబయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డా బి అర్ అంబేద్కర్ విగ్రహానికి నిరుపేద కుటుంబానికి చెందిన అరెపెల్లి అక్షయ ఎంబిబియస్ లో సీటు సాధించినందుకు తనతో పాటు దళిత సంఘ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అక్షయను శాలువాతో సన్మానిచ్చారు.భవన నిర్మాణ కూలీల సంఘము అధ్యక్షులు సాంబయ్య మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలొ పుట్టి మెడికల్ సీటు సాధించినందుకు చాలా ఆనందంగా వుందని హుస్నాబాద్ నియోజకవర్గం లొ తల్లి తంద్రులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమం లొ శనిగరం వెంకటేష్, జడ్సన్, కిరణ్, ప్రకాష్, అరెపెల్లి రాజయ్య, సునీత, మేకల చేరాలు, స్వామి రావు, వెంకటయ్య, కొమురయ్య లు అక్షయ ను అబినందించారు.

# నిరుద్యోగ యువతకు ప్రత్యేక యాప్

**పట్టభద్రులందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలి**

**కరీంనగర్ పట్టణ కేంద్రంలో పట్టబదుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం**





**తొలి సమయం కరీంనగర్, నవంబర్ 03**

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ బి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ పట్టణ కేంద్రంలోని గిద్దె గిద్దె పేరుమండ్ల స్వామి ఆలయ మైదానంలో వాకర్సో తో , జిల్లా గ్రంథాలయ లో పట్టభద్రులతో ముఖాముఖి సమావేశం నిర్వహించడం జరిగింది.. రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు.రానున్న రోజుల్లో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ రానున్నదని దానికనుంగా కొన్ని మార్పులనుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిసమస్య లను పరిష్కరిస్తామన్నారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల స్కాలర్షిప్, రీయింబర్స్ మెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాను గెలిచాక పై సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు.రాష్ట్ర జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సమాయత్తమవుతున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆల్ఫోర్స్ పక్షాన ఉచిత యాప్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గత ఆరు నెలల కాలంగా ఉద్యోగ నియామకాలు వేగంగా జరుగుతున్నాయని అన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి హడావిడి లేకుండా ఉద్యోగాలు చకచకా భర్తీ అవుతున్నాయని, దీని కోసం నిరుద్యోగులను సన్నద్ధం చేయాడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ ద్వారా ఉచి తంగా కోచింగ్ అందిస్తున్నామని, నిరుద్యోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాబోవు పట్టభద్రుల ఎన్ని కల బరిలో ఉన్న తనకు అన్ని వర్గాల నుండి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు.ప్రైవేటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్ని ఆసుపత్రులలో నగదు రహిత వైద్య సేవలు అందించే విధంగా శాయశక్తుల కృషి చేస్తానని రాజ్యాంగంలో కల్పించబడ్డ హక్కులను దరి చేర్చబడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇచ్చే సమయంలో కఠినతరమైన నిబంధనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఫైర్ సేఫ్టీ,క్రీడా మైదానాలు, నీటి వసతుల తదితర అంశాలను ప్రభుత్వం పరంగా అందించేందుకు కృషి చేస్తారని అన్నారు.రాబోయే రోజుల్లో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మినిమమ్ బేసిక్ శాలరీ ( %వీదీూ% )అమలు జరిగే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాల యజమాన్యాలకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు.రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలనికోరారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6 లోపు తమ యొక్క ఓటు నమోదును చేసుకోవాలని పిలుపునిచ్చారు. మిస్డ్ కాల్ క్యాంపెయిన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.





# సర్వేలో సమగ్రత లోపించరాదు !

**తొలి సమయం హైదరాబాద్,**

ఓ దశాబ్దం క్రితం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత...కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక సమగ్ర సర్వే అనేది ఒకటి చేపట్టారు. అప్పుడు ప్రజలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. ఇప్పుడు మరోమారు కులగణన చేపట్టబోతున్నారు. ఆనాటి సర్వే వివరాలు ఏమయ్యాయో అని నేటి ప్రభుత్వం చెబుతోంది. సర్వే వివరాలను కూడా ఏం చేశారో నాటి కెసిఆర్ సర్కార్ లోని అధికారులు కూడా చెప్పడం లేదు. ప్రభుత్వం అంటే ఇది కాంగ్రెస్, కెసిఆర్ వ్యవహారం కాదు. ఇది ప్రజలకు సంబంధించిన వ్యవహారం . ఆనాడు సర్వేలో పాల్గొన్న అధికారులు ఉన్నారు. ఆ వివరాలు ఏమయ్యాయో నిలదీయాలి. అలాగే సర్వ ఏ వివరాలను పబ్లిక్ డాక్యుమెంట్ చేయాలి. కంప్యూటర్లో నిక్షిప్తం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా కార్యక్రమాలు చేపట్టడం, దాచి పెట్టడం సరికాదు. రోజు ట్విట్టర్ లేదా, మీడియా ముందు అనేక విషయాలు పంచుకుంటున్న కెటిఆర్, హరీష్ రావులు, వారి అనుచరగణం ఆనాటి సర్వే వివరాలను వెల్లడించాలి. ఎక్కడ ఏం చేశారో చెప్పాలి. ఇది ప్రజల డిమాండ్గా గుర్తించాలి. ఎందుకంటే ప్రభుత్వం బిసి కులగణనతో మారోమారు జనంలోకి వెళుతున్న వేళ గతంలో చేపట్టిన సర్వే వివరాలను వెల్లడించాలి. ఇదేమీ రహస్య డాక్యుమెంట్ కాదని గుర్తించాలి. అలాగే ఇది తమ వ్యక్తిగతం అనుకోవడానికి కూడా లేదు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 6వ తేదీ నుంచి ఇంటింటికి సమగ్ర సర్వే కు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధపడింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే ఆధారంగా కులగణనను చేపట్టనుంది. ఈ నేపథ్యంలోనే దీనికోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే బిసి కమిషన్, పిసిసి ఎవరి స్థాయిలో వారు సమావేశాలు నిర్వహిస్తున్నారు. పనిలో పనిగా సర్వేలో అన్న వివరాఉల రాబట్టాలి. కులాలతో పాటు,ప్రజల ఆర్థిక స్థితిగతులు, నిరుద్యోగులు సంఖ్య, అక్షరాస్యుల సంఖ్య, రేషన్ కార్డుల వివరాలు ఇలా మొత్తం వివరాలు సేకరించాలి. దీంతో ప్రజలకు ఏ పథకం అందాలో..అందకూడదో కూడా తెలుసుకునే అవకాశం వస్తుంది. ప్రజల సొమ్ముతో అనేక పథకాలు ప్రవేశ పెట్టిన ప్రభుత్వం..అవి సక్రమంగా పేదలకు అందుతున్నాయో లేదో కూడా తెలుసుకోవాలి. దుబారా అవుతుంటే గుర్తించాలి. ఇందిరమ్మ ఇళ్లు ఇసతామంటున్న క్రమంలో ఇళ్లు లేని వారి ఆర్థిక స్థితిగతులను కూడా గుర్తించాలి. ఈ సర్వే దేశానికి దిక్సూచి కావాలని కోరుకుంటున్న సిఎం రేవంత్ అందుకు అనుగుణంగానే సర్వేకు సంబంధించిన విధివిధానాలు ఉండేలా చూసుకోవాలి.అన్ని జిల్లాల్లో ఈ సర్వేపై సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ శ్రేణులను అందుకు సమాయత్తం చేయాలి. పిసిసి అధ్యక్షుడు ఇప్పటికే అన్ని జిల్లాల డిసిసి అధ్యక్షులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే డిసిసి అధ్యక్షులు, మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు,టిపిసిసి ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్, దేవాలయ, గ్రంథాలయ కమిటీలు, సీనియర్ నాయకులు కూడా సర్వేలో పాల్గొని ఆయా జిల్లాల్లో కులగణన ప్రాధాన్యత, ప్రచార అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన కోసం ప్రభుత్వం ఇప్పటికే జీఓ నెం 199 ద్వారా బిసి కమిషన్ చైర్మన్గా నిరంజన్ను, రాపోలు జయ ప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మిలను మెంబర్లుగా నియమించింది. ఇక రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్ మెంట్ను నోడల్ డిపార్ట్ మెంట్గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ పౌరులతో పాటు ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలపై ప్రణాళికలు రచ్చించి వాటిని అమలు చేయడం కోసం ఫిబ్రవరిలోనే శాసనసభలో ఈ సర్వే కోసం ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఇంటింటికి సమగ్ర సర్వే ,కులగణనను సంబంధించిన ప్రశ్నావళిని ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 56 ప్రధాన ప్రశ్నలతో పాటు 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలను ఖరారు చేసింది. పార్ట్-1లో యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించి 58 ప్రశ్నలుండగా పార్ట్-2లో కుటుంబ వివరాలకు సంబంధించి 17 ప్రశ్నలున్నాయి. మొత్తం 7 పేజీల్లో వీటిని పూరించాల్సి ఉంటుంది. కుటుంబ యజమానితో పాటు కుటుంబంలోని సభ్యుల వ్యక్తిగత వివరాలను ప్రభుత్వం సేకరించనుంది. పార్ట్-1లో వ్యక్తిగత వివరాల్లో మతం, సామాజిక వర్గం, కులం, ఉప కులంతో పాటు మాతృభాష, వైవాహిక స్థితి, పాఠశాల రకం, విద్యార్హత, ఉద్యోగం, ఉపాధి, కుల వృత్తి, వార్షిక ఆదాయం, ఐటి రిటర్న్, స్థిరాస్తులు, ధరణి పాసుబుక్ నెంబర్, రిజర్వేషన్తో పొందిన ప్రయోజనాలున్నాయి.

# ట్రంపా.. కమలా?...

(మొదటిపేజీ తరువాయి)

నాటోపై వెచ్చించేలా ఒత్తిడి తీసుకువస్తానని ప్రకటించారు. 2024 నాటికి నాటోలోని 23 దేశాలు మాత్రమే ఈ లక్ష్యాన్ని సాధించాయి.

**ట్రంప్‌తో 'పన్ను'పోటే?**

ట్రంప్ గెలిస్తే.. చైనా నుంచి జరిగే దిగుమతులపై 60-200 వరకు పన్ను(టారిఫ్) విధించే అవకాశాలున్నాయి. ఇతర దేశాల నుంచి దిగుమతులపై 20 పన్ను(యూనివర్సల్ టారిఫ)ను అమలు చేస్తారని తెలుస్తోంది. ఇలాంటి చర్యలు వాణిజ్య యుద్ధాలు, ప్రతీకార చర్యలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కుదుపులు తప్పవని ఆర్థికరంగ నిపుణులు భావిస్తున్నారు. తద్వారా జీరో కార్బన్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు ప్రపంచం చేస్తున్న ప్రయత్నాలకు గండిపడే ప్రమాదముంది. జోబైడెన్ ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు అమలు చేసిన విధానాలను ట్రంప్ రద్దు చేసే ప్రమాదం ఉన్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**యుద్ధం-శాంతి**

పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు అమెరికా, నాటో చర్యలు తీసుకోగా.. ట్రంప్ హయాంలో సేనల ఉపసంహరణ జరిగింది. ఫలితంగా అఫ్గానిస్థాన్ తిరిగి తాలిబాన్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. రెండేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కమల, ట్రంప్‌లది భిన్నస్వరం. బైడెన్ సర్కారు మాదిరిగా కమల కూడా నాటో ద్వారా మిలటరీపరంగా, ఆర్థికంగా ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే అవకాశాలుండగా.. ట్రంప్ బేషరతుగా రష్యాతో ఒప్పందం కుదుర్చుకునేలా ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెస్తానని చెప్పారు. ఇజ్రాయెల్ విషయంలో మాత్రం ఇరువురి ఆలోచనలు దాదాపు ఒకేలా ఉన్నాయి. తైవాన్ విషయంలోనూ.. చైనా దాడి చేయకుండా చూస్తున్నందుకు తమకు డబ్బులివ్వాలని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. కాగా, ట్రంప్ అధికారంలోకి వస్తే.. అమెరికాలో ఉన్న వలసదారులకు ఇబ్బందేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ట్రంప్ అయితే చంపడు!**

అమెరికాలో పతాకస్థాయికి చేరుకున్న అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌కు బహిరంగ మద్దతు ప్రకటించిన ఈలన్ మస్క్.. ప్రస్తుత బైడెన్ పరిపాలనను, అధికార యంత్రాంగాన్ని దుయ్యబట్టే ఏ అవకాశాన్నీ వదులుకోవట్లేదు. తాజాగా ఆయన 'పీనట్' అనే ఉడతను న్యూయార్క్ రాష్ట్ర అధికారులు యుథనేషియా(కారుణ్యమరణం) చేయడంపై మండిపడ్డారు. "ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ఉడతలను పరిరక్షిస్తారు" అని ట్వీట్ చేశారు. 'రిప్ (రెస్ట్ ఇన్ పీస్) పీనట్' అంటూ ఏడుపు ముఖం ఎమోజీని కూడా ఆ ట్వీట్‌కు జత చేశారు. ఇంతకీ ఆ ఉడత కథ ఏమిటంటే.. ఏడేళ్ల క్రితం పీనట్(ఉడత) తల్లి రోడ్డు దాటుతూ ఒక కారు కింద పడి చనిపోయింది. పీనట్‌ను మార్క్ లాంగో అనే వ్యక్తి తెచ్చి పెంచుకున్నాడు. ఆ ఉడతతో రకరకాల విన్యాసాలు చేయించి సోషల్ మీడియాలో పెట్టేవాడు. దీంతో అది బాగా పాపులర్ అయిపోయింది. అయితే, అక్టోబరు 30న న్యూయార్క్‌లోని పర్యావరణ పరిరక్షణ విభాగం (డీఈసీ) అధికారులు లాంగోఇంటిపై దాడి చేసి, సోదాలు చేసి పీనట్‌ను, ఫ్రెడ్ అనే రకూన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటివల్ల మనుషులకు రేబిస్ వచ్చే ప్రమాదం ఉందంటూ తీసుకెళ్లి చంపేశారు! అధికారుల తీరును ఖండిస్తూ మస్క్‌తోపాటు వేలాదిమంది సోషల్ మీడియాలో బైడెన్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు.

**భారత్‌తో అనుబంధంపై కమల వ్యాసం**

భారతీయ-అమెరికన్ ఓటర్లలో 32% ట్రంప్‌వైపు మొగ్గుచూపారని సర్వేలు వెలువడడంతో.. కమల నష్టనివారణ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో తన తల్లి శ్యామల హ్యారిసను స్మరించుకుంటూ.. దక్షిణాసియా పత్రిక జాగర్నాట్‌లో సుదీర్ఘ వ్యాసం రాశారు. "నా తల్లి శ్యామల హ్యారిస్ 19 ఏళ్ల వయసులో అమెరికాకు వచ్చారు. ఆమె రెండు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగారు. వాటిల్లో ఒకటి రొమ్ము క్యాన్సర్‌ను నివారించడం. రెండోది నన్ను, నా సోదరి మాయను క్రమశిక్షణతో పెంచడం. మాకు భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని గౌరవించాలని బోధించేవారు" అని ఆ వ్యాసంలో చెప్పుకొచ్చారు. రెండేళ్లకోసారి దీపావళి పండుగను జరుపుకొనేందుకు తమిళనాడుకు వస్తామని పేర్కొన్నారు. "నాకు గుర్తుంది. మా తాతగారు పీవీ గోపాలన్ రిటైర్ అయ్యాక.. రోజూ బీచ్‌లో వాహ్యాళికి వెళ్లేవారు. నా చిన్నప్పుడు నేనూ ఆయనతో నడిచేదాన్ని. ఆ సమయంలో ఆయన తన సహచరులతో ప్రజాస్వామ్యం, విలువల గురించి మాట్లాడేవారు" అని వివరించారు.

# ఝార్ఖండ్‌లో...

(మొదటిపేజీ తరువాయి)

చొరబాటుదారులను ఓటుబ్యాంకుగా చూస్తోందని నిందించారు. చొరబాటుదారుల వల్ల రాష్ట్రంలో గిరిజన జనాభా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'చొరబాటుదారులు మన కుమార్తెలకు వలవేసి, వారిని పెళ్లి చేసుకొని ఇక్కడి భూమిని ఆక్రమిస్తున్నారు. దీన్ని ఆపకపోతే ఝార?ండ్‌కు భద్రత ఉండదు. ఝార?ండ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతోంది. ఈ చొరబాటుదారులందరినీ మేం ఏరిపారేస్తాం. అసోంలోని బీజేపీ ప్రభుత్వం చొరబాట్లను ఆపేసింది. ఇక్కడ కూడా అదే నిబద్ధతతో రోటీ, బేటీ(కుమార్తె), మాటీ(భూమి)ని పరిరక్షిస్తాం' అని అమిత్‌షా స్పష్టం చేశారు.

# నీటి పారుదల శాఖ..

(మొదటిపేజీ తరువాయి)


కాకుండా.. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా టెండర్లను ఆహ్వానించడం నిబంధనల ఉల్లంఘననే అని నీటిపారుదల శాఖలో చర్చ జరుగుతోంది. అయితే.. మంత్రుల సమీక్ష మినట్స్‌లో.. తక్షణమే టెండర్లను నిర్వహించాలని మంత్రులు ఆదేశించిట్లు స్పష్టంగా ఉందని, అందుకే టెండర్లను పిలిచినట్లు బాధ్యులైన అధికారులు చెబుతున్నట్లు సమాచారం.

**బిడ్లను తెరవడానికి అనుమతులు తప్పనిసరి**

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు సంబంధించిన ఆరు టెండర్లకు ఈ నెల 8తో, ఒక టెండర్‌కు ఈ నెల 4తో బిడ్ల దాఖలు గడువు ముగియనుంది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్(సీఓటీ)లోని చీఫ్ ఇంజనీర్ల కమిటీ బిడ్లను పరిశీలించి ఎల్-1 బిడ్డర్‌ను ఖరారు చేయాల్సి ఉంటుంది. సంబంధిత పనులకు పరిపాలనపర అనుమతులు, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా బిడ్లను తెరిచి.. పరిశీలించడానికి నిబంధనలు ఒప్పుకోవని అధికారవర్గాలు గుర్తుచేస్తున్నారు. ఇదే విషయాన్ని ఈఎన్‌సీ(జనరల్) పదేపదే ప్రస్తావించడమే వివాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ జరుగుతోంది. విజిలెన్స్ విచారణలు కూడా అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న విషయం తెలిసిందే..!

# దీపావళి వేడుకల్లో కెనడా ప్రధాని

**భారత్,కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతల వేళ చర్య**



**న్యూఢిల్లీ, నవంబరు 3:** భారత్-కెనడాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న వేళ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో దీపావళి వేడుకలు జరుపుకొన్న వీడియోని ఆదివారం సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "హ్యాపీ దీపావళి... ఈ వారం హిందువులతో ఎన్నో ప్రత్యేక సందర్భాలు గడిచాయి.." అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కెనడాలోని మూడు హిందూ ఆలయాలవారు బహూకరించిన కంకణాలను ట్రూడో చేతికి కట్టుకోవడం ఆ వీడియోలో కనిపించింది. "ఈ కంకణాలు అదృష్టాన్ని ఇస్తాయి.. రక్షణ కల్పిస్తాయి.. అవి ఊడిపోయేంత వరకు వాటిని నేను తొలగించను.." అని ట్రూడో తన పోస్టులో పేర్కొన్నారు. అక్టోబరు 31న కూడా ట్రూడో కెనడియన్లకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ కెనడాతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మందితో దీపావళి జరుపుకోబోతున్నామని ఆ రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు, 2023 సెప్టెంబరులో నిజ్జర్ హత్య ఘటన తర్వాత భారత్-కెనడాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINT-ERS GRAPHICS